





ఓటెత్తుదాం..

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లకు అవగాహన కల్పించడానికి జోగిపేటలో నిర్వహించిన '5-కే రన్'కు విశేష స్పందన లభించింది. ఆర్డీవో పాండు ఆధ్వర్యంలో నిర్వహించిన పరుగులో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ సిబ్బంది, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయం వద్ద రన్‌ను ప్రారంభించగా.. అన్నాసాగర్ వరకు కొనసాగింది. తహసీల్దార్ భాస్కర్ కుమార్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, పీడీ వీబీ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, మహేందర్, కాలేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

-జోగిపేట, మార్చి 26





ఇది.. మా అడ్డా

డబుల్‌బెడ్రూం ఇళ్లలో అసాంఘిక శక్తుల తిష్ఠ

- అసంపూర్తిగా పేదల కోసం నిర్మించిన ఇళ్లు
- నిఘా కొరవడడంతో రెచ్చిపోతున్న ఆకతాయిలు

సంగారెడ్డి రూరల్, మార్చి 26: పేదలకు పంపిణీ చేయడం కోసం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో సంగారెడ్డి మండలం మనుమాన్‌నగర్‌లో 70 డబుల్‌బెడ్రూం ఇళ్లను నిర్మించారు. హనుమాన్‌నగర్, దాసు గడ్డ తండాల్లోని పేదలకు పంపిణీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఇళ్ల కోసం 350 మంది దరఖాస్తులు చేసుకున్నా పంపిణీ చేయలేదు. పనులు మధ్యలోనే వదిలేయడంతో ఇళ్లకు బిగించిన తలుపులు, కిటికీలను కూడా గుర్తుతెలియని దొంగిలించారు. కాపలా లేకపోవడంతో డబుల్ బెడ్రూం ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇళ్లు నిరుపయోగంగా ఉండడం.. అడిగేవారు దిక్కు లేకపోవడంతో మందుబాబులు, అసాంఘిక శక్తులకు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. మరోవైపు ఇళ్ల కోసం ఆశతో ఎదురుచూసిన పేదలకు నిరాశే మిగిలింది. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా పనులు పూర్తికాకపోవడం.. ఎవరూ పట్టించుకోకపోవడంతో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన ఇళ్లు పేదలకు దక్కకుండా పోతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో డబుల్ బెడ్రూం ఇళ్లపై ఆశలు వదులుకోవాలని ఓ స్థానిక ప్రజాప్రతినిధి లబ్ధిదారులకు చెప్పడం గమనార్హం.

పేదలకు పంపిణీ చేయాలి



డబుల్‌బెడ్రూం ఇళ్లను నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు స్థావరంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వమయినా అర్హులకు ఇళ్లను పంపిణీ చేయాలి.

-చంద్రమోహన్,
టీసీపీఐ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం

డబుల్‌బెడ్రూం ఇళ్లలో ఇంకా కొంత పనులు జరగాల్సి ఉన్నది. ఇళ్ల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాలేదు. ఖాళీగా ఉన్న ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై చర్యలు తీసుకుంటాం.

-రూప్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి

తల్లిని చంపిన కొడుకు 7లో

పోలింగ్ సిబ్బంది

మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, మార్చి 26 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ పూర్తయినట్టు సంగారెడ్డి, మెదక్ జిల్లాల కలెక్టర్లు తెలియజేశారు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంగారెడ్డి కలెక్టరేట్‌లో, మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ మెదక్ కలెక్టరేట్‌లో జరిగిన ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు 8,363 మందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామని పేర్కొన్నారు. వీరికి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మజా రాణి, డీవో వెంకటేశ్వర్లు, డీఐవో ఎన్ఐసీజీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో 769 పోలింగ్ కేంద్రాలకు 4,164 మంది సిబ్బందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామని తెలిపారు. వీరిలో 1,041 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 1,041 మంది సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 2,082 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియలో పోలింగ్ కేంద్రాలవారీగా సిబ్బందిని కేటాయిస్తామని తెలియజేశారు. ఆయనవెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి



మెదక్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్





జెండాపై కపిరాజు

హనుమాన్ విగ్రహప్రతిష్ఠ ఉత్సవాల్లో ఓ వానరం హల్‌చల్ చేసింది. ఆలయ శిఖరంపై జెండా వద్ద కూర్చున్నది. అనంతరం శోభాయాత్ర కోసం సిద్ధం చేసిన ట్రాక్టర్‌పై కూర్చున్నది. గంటల తరబడి కదలకుండా ఉండిపోయింది. రామాయంపేట మండలం కోమటిపల్లిలో చోటుచేసుకుంది.

-రామాయంపేట

వేసవిలో తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మార్చి 26: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సీఎస్ శాంతికుమారితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరాలో వచ్చే ఆటంకాలను పరిష్కరించాలని సూచించారు. ప్రతీ గ్రామం, మున్సిపల్‌వార్డు స్థాయిలో తాగునీటి సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సమ్మర్ యాక్షన్‌ప్లాన్, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో తాగునీటి అవసరాల మేరకు బోర్లు, తాగునీటి సరఫరా మోటార్లను పునరుద్ధరించాలని పేర్కొన్నారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో యాదయ్య, ఈఈ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

161 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

శివంపేట శివారులో కారును ఢీకొట్టిన టిప్పర్

పుల్‌కల్, మార్చి 26: సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదంలో పెను ప్రమాదం తప్పింది. పుల్కల్ ఎస్ఐ కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన సురేష్‌పాటిల్.. తమ్ముడు రాజు పాటిల్, బావ సునీల్‌హింగ్నే, దత్తుహింగ్నేలతో కలిసి దైవ దర్శనానికి కామారెడ్డి జిల్లా జుక్కల్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో శివంపేట వద్ద హైవే మలుపునకు వద్ద సంగారెడ్డి నుంచి జోగిపేట వైపునకు వెళ్తున్న టీయూ15యూసీ 1314 నంబరు టిప్పర్ ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు పల్టీలు కొట్టుకుంటూ డివైడర్ మధ్యలో ఎగిరిపడి పడింది. ప్రమాదం దాటికి కారు ధ్వంసమైంది. సంఘటన విషయం తెలుసుకున్న ఎన్‌హెచ్ఏఐ తాడ్దానిపల్లి టోల్ ప్లాజా అంబులెన్స్‌తో పాటుగా 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగ్రాతులను బయటకు తీశారు. కారు నడుపుతున్న సునీల్ హింగ్నేకు గాయపడటంతో సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై అర గంట పాటు ట్రాఫిక్ స్తంభించడంతో జాతీయ రహదారి రెస్క్యూ సిబ్బంది వాహనాలను క్రమబద్ధీకరించారు. సురేష్ పాటిల్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



బోల్తా పడిన కారు



కారును ఢీకొట్టిన టిప్పర్

మహాలక్ష్మి పేరిట మహామోసం

- రైతుబంధు పెంచలేదు.. ఉన్నది ముంచిండు
- వంద రోజుల్లోనే ప్రజలకు అర్థమైంది
- కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు
- వెంకట్రామారెడ్డిని 50వేల మెజార్టీతో గెలిపిద్దాం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 26: అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. రైతులను మోసం చేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. మెదక్‌లోని వైస్రాయ్‌గార్డెన్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహాలక్ష్మి పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మహా మోసం చేసిందని విమర్శించారు. వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ప్రజలకు అర్థమయిందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. కల్యాణలక్ష్మితో తులం బంగారం ఎక్కడైనా ఇచ్చారా? పెన్షన్ రూ. 4వేలు వస్తున్నదా? ధాన్యం మద్దతు ధర రూ.2,500కు పెంచారా? మహిళలకు రూ.2వేలు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. రైతుబంధు సాయం రూ.15 వేలకు పెంచుతామన్న వారు.. కనీసం రూ. 10వేలు కూడా ఇవ్వలేకపోతున్నారని మండిపడ్డారు. కరోనా సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా రైతుబంధు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. రుణమాఫీ చేస్తామన్న ఈ ప్రభుత్వం.. రేగోడ్ మండలంలో ఏపీజీవీబీ అధికారులు రుణాలు చెల్లించాలని నోటీసులిచ్చినా స్పందించడం లేదని మండిపడ్డారు. దేశం, రాష్ట్రం, రాజ్యాంగం గురించి తెలిసిన మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డిని గెలిపించుకుంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించకపోవడంతోనే బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందని పేర్కొన్నారు.

ఆలయాల పేరిట బీజేపీ రాజకీయం

బీజేపీ ఆలయాల పేరిట రాజకీయాలు చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. దన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రూపాయి విలువ పడిపోయిందని విమర్శించారు. బీజేపీ పాలనలో ఆదానీ, అంబానీలే బాగుపడ్డారు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును అసెంబ్లీ ఎన్నిక్కల్లోనే ప్రజలు ఓడించారని.. ఆయన ఎంపీగా ఎం గెలుస్తారని అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ప్రజలకు సేవలందించిన వెంకట్రామారెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలు నెరవేర్చని విషయాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ అదనపు కలెక్టర్‌గా, కలెక్టర్‌గా ప్రజలకు సేవలందించిన తాను.. మరింత ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వస్తున్నానని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే ట్రస్ట్ ఏర్పాటు చేసి విద్య కోసం రూ. వంద కోట్లు ఖర్చు పెడతానని ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతశేఖర్‌గౌడ్, వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, నాయకులు దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చంద్రపాల్, మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి, చంద్రాగౌడ్, యమున, జితేందర్‌గౌడ్, ఏకే గంగాధర్, శేరి నారాయణరెడ్డి, మామిళ్ల ఆంజనేయులు, భీమరి కిషోర్, విశ్వం, సమియొద్దీన్, బట్టి లలిత, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్‌లో నియోజకవర్గస్థాయి సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న హరీశ్‌రావు

నేను పక్కా లోకల్

- ఉమ్మడి జిల్లాతో పాతికేళ్ల అనుబంధం
- రూ.100కోట్లతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తా
- 7 నియోజకవర్గాల్లో ఫంక్షన్ హాళ్లు కట్టిస్తా
- బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

సంగారెడ్డి టౌన్, మార్చి 26 : సంగారెడ్డి జిల్లాలో 25 సంవత్సరాలుగా ఉంటున్నానని.. తాను పక్కా లోకల్ అని బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను నాన్‌లోకల్ అభ్యర్థిగా ఇతర పార్టీ నాయకులు దుష్ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో డ్వామాపీడీగా, జాయింట్ కలెక్టర్‌గా, జిల్లా కలెక్టర్ విధులు నిర్వహించానని.. ప్రస్తుతం రామచంద్రపురం మండలం తెల్లాపూర్‌లో నివాసం ఉంటున్నానని తెలిపారు. కేసీఆర్, హరీశ్‌రావుల ఆదేశాలతోనే తాను బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు తెలిపారు. తన గెలుపు కోసం ప్రతీ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు. తనన గెలిపిస్తే పార్లమెంట్ పరిధిలో రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి పేదల విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పిస్తానని తెలిపారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఒకొక్కటి రూ.2 కోట్ల చొప్పున ఖర్చు చేసి 7 ఫంక్షన్‌హాళ్లను నిర్మిస్తానని, పేదలు ఉచితంగా శుభకార్యాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఓటమి భయంతోనే ఇతర పార్టీల నాయకులు తనను నాన్ లోకల్ ముద్రవేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డికి భారీ మెజార్టీ అందించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, రైతులకు రూ.500 బోనస్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌లో అదనంగా తులం బంగారం ఇస్తానని మోసం చేసిందని మండిపడ్డారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు సోషల్ మీడియాను నమ్ముకొని బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రఘునందన్‌రావు కలెక్షన్ల కోసమే ఎలక్షన్లలో పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, మనోహర్‌గౌడ్, కొండల్‌రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో మాట్లాడుతున్న వెంకట్రామారెడ్డి

గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యం

జహీరాబాద్, మార్చి 26: జహీరాబాద్ మండల పరిధిలోని తూంకుంట శివారులో గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరం లభించిందని రూరల్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. తూంకుంట శివారులోని అడవిలో అటవీశాఖ బీట్ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో చెట్లపొదలను తొలగిస్తున్న క్రమంలో మనిషి అస్థిపంజరం కనిపించింది. మృతుడి వయస్సు 65 ఏళ్లు ఉంటుందని చెప్పారు. ఫారెస్ట్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాల్సిందే

● కంకర క్రషర్ ఎదుట గ్రామస్థుల ఆందోళన



కంకర క్రషర్ యాజమాన్యంతో మాట్లాడుతున్న గ్రామస్థులు, నాయకులు

హత్నూర, మార్చి 26: కంది మండల పరిధిలోని ఆరుట్ల గ్రామ శివారులో గల జీవీఆర్ కంకర క్రషర్ నుంచి వెళ్తున్న టిప్పర్ ఢీకొని గుండ్లమాచునూర్ గ్రామానికి చెందిన మొండి కృష్ణ(58) సోమవారం రాత్రి మృతిచెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం గ్రామస్థులు పెద్దఎత్తున క్రషర్ వద్దకు చేరుకుని బైఠాయించారు. క్రషర్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. క్రషర్ యాజమాన్యం స్పందించకపోవడంతో సిబ్బందిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం అధిక లోడు, అతివేగంతో టిప్పర్లు వెళ్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది గాయపడ్డారని, పలువురికి అవయవాలు కూడా పోయాయని ఆరోపించారు. పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చినా.. లెక్క చేయడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా గ్రామస్థులు చేపట్టిన ఆందోళనకు ఆయా రాజకీయ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, స్థానిక నాయకులు కంకర క్రషర్ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి ఇరువురికి పలు విధాలుగా నచ్చజెప్పి, రూ.15 లక్షల ఆర్థిక సహాయం ఇచ్చేలా ఒప్పించారు. దీంతో ఆందోళనకారులు శాంతించి అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ ఆందోళనలో లో ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్, నాయకులు శశిధర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కర్రె కృష్ణ, తంగేడుపల్లి సత్యం, యాదగిరి, శ్రీశైలం, అశోక్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాల సందర్భంగా అగ్నిప్రతిష్ఠ చేస్తున్న వేదపండితులు


ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న దృశ్యం


హన్మంతరావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈవో అన్నపూర్ణ

వైభవంగా చంద్రమౌళీశ్వరస్వామి ప్రతిష్ఠోత్సవాలు

- భక్తి పారవశ్యమైన శంభుగిరి కొండలు
- భారీగా తరలివచ్చిన భక్తులు

వర్గల్, మార్చి 26: వర్గల్ శంభుగిరి కొండలపై వెలసిన విద్యాధరి క్షేత్రంలో నూతనంగా నిర్మించిన చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో శ్రీపరివార సమేత చంద్రమౌళీశ్వరస్వామి ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి నాచగిరి క్షేత్రం పీఠాధిపతులు మధుసూదనానంద సరస్వతీ స్వామిజీ హాజరు కాగా.. ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం చంద్రమౌళీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని యంత్రమూర్తి ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, రక్షాబంధనం, దీక్షాధారణం, ఋత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, శాలా సంస్కారం, వాస్తు, యోగినీ, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర, లింగతోభద్ర మంటపదేవతా ఆవాహన ఉపచార పూజలు, వాస్తు పర్యగ్నికరణం, కుండసంస్కారం, అగ్నిప్రతిష్ఠాపన, ఆవాహిత దేవతాహవనములు, జలధివాసనం, నీరాజనంతో పాటు తదితర పూజలు నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పూజల అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో 29 నుంచి ఏప్రిల్ 9వ తేదీవరకు జరగనున్న స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మంగళవారం దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ హన్మంతరావుకు ఆలయ కార్యనిర్వహణ అధికారి అన్నపూర్ణ అందజేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో పాల్గొనాల్సిందిగా కోరారు. ఆయనకు లక్ష్మీనృసింహస్వామి ప్రసాదంతో పాటు స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు, వేదపండితులు హరిప్రసాద్‌శర్మ, గోపాలకృష్ణశర్మ ఆలయ అధికారులు సుధాకర్, నరేందర్ పాల్గొన్నారు.

తల్లిని హత్య చేసిన కొడుకు

- మెదక్ మండలం రాజ్‌పల్లిలో ఘటన


దేవమ్మ(ఫైల్)

మెదక్ అర్బన్, మార్చి26: కన్నతల్లిని కొడుకు ఇటుకతో కొట్టి హత్య చేసిన సంఘటన మెదక్ మండల పరిధిలోని రాజ్‌పల్లిలో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన ఆరెగూడెం దేవమ్మ(58) సోమవారం హోలీ పండుగ కావడంతో పక్కింటి వాళ్ల నుంచి షాంపూ తెచ్చుకోవడంతో కొడుకు నారాయణ తల్లితో రాత్రి గొడవపెట్టుకున్నాడు. మాటామాటా పెరగడంతో నారాయణ ఇటుకతో తల్లి తలపై బలంగా కొట్టడంతో తీవ్రగాయాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి అక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్ రూరల్ సీఐ కేశవులు తెలిపారు.

చెరువులో గల్లంతైన ఇద్దరు మృతి

- మృతదేహాలు వెలికితీత


శంకర్, శ్రావణ్(ఫైల్)

జిన్నారం, మార్చి 26: వీరన్నగూడెం గ్రామ పరిధిలోని వీరన్న చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతైన ఘటనలో మదుపాక శ్రావణ్(17), కొమురాళ్ల శంకర్(22) మృతదేహాలను మంగళవారం వెలికితీసినట్లు గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మృతులు సహా మరో పదిమంది స్నేహితులు హైదరాబాద్ శివారులోని సూరారంకు చెందినవారు. సోమవారం సాయంత్రం వీరంతా వీరన్న చెరువులో స్నానాలకు వచ్చారు. స్నానం చేస్తున్న క్రమంలో శ్రావణ్, శంకర్ గల్లంతయ్యారు. ఈ విషయాన్ని ఆంజనేయులు అనే వ్యక్తి శ్రావణ్ తండ్రికి ఫోన్‌చేసి చెప్పాడు. కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని గాలించారు. మంగళవారం ఉదయం చెరువులో ఇద్దరి మృతదేహాలను గుర్తించి, బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి పంపినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు శ్రావణ్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


బైండ్ల ప్రశాంత్

మనూరు, మార్చి 26: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. మనూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన బైండ్ల ప్రశాంత్(26) నల్ల పోచమ్మ ఆలయ ఆవరణలో ఫాస్ట్‌ఫుడ్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం షాపులో పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి గతేడాది వివాహం జరిగింది. ప్రస్తుతం భార్య గర్భవతి అని స్థానికులు తెలిపారు. పేద కుటుంబానికి చెందిన ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

రామాయంపేట, మార్చి 26: భార్య కాపురానికి రావడం లేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిల్లా కేంద్రమైన మెదక్‌లోని నవాబ్‌పేట ప్రాంతానికి చెందిన మొకిరె మహేష్(32), జ్ఞానేశ్వరి భార్యాభర్తలు. 8 ఏళ్ల క్రితం వివాహం కాగా.. వీరికి కుమారుడు(7), ఏడాదిన్నర కుమార్తె ఉన్నారు. అయితే మహేష్ ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరుగుతుండడంతో భార్య గొడవపడి సంవత్సరం క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన మహేష్ రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట-భిక్కనూర్ రైల్వే ట్రాక్‌పై పడుకుని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీడిపల్లిలో వ్యక్తి అదృశ్యం


రమేష్(ఫైల్)

మనోహరాబాద్, మార్చి 26: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన దొంతి రమేష్(30) బతుకుదెరువు కోసం జీడిపల్లికి వచ్చి అద్దెకుంటూ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య సునీత, కూతురు, కుమారుడు ఉన్నారు. సోమవారం రాత్రి తాగొచ్చి భార్యతో గొడవపడి, సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆందోళన చెందిన భార్య చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వైవిధ్య భరితం

- ఆతిథ్య ఉపన్యాసంలో ప్రొఫెసర్ మధుర స్వామినాథన్
- త్రిపుర రైతులపై పుస్తకావిష్కరణ


మాట్లాడుతున్న ప్రొఫెసర్ మధుర స్వామినాథన్

పటాన్‌చెరు రూరల్, మార్చి 26: భారతదేశంలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వైవిధ్య భరితమైనదని, వ్యవసాయ వర్గ సంబంధాలపై చారిత్రక, ఆర్థిక పరిస్థితుల ప్రభావాన్ని గుర్తించాల్సిన ఆవశ్యకత ఉన్నదని డాక్టర్ మధుర స్వామినాథన్ అన్నారు. బెంగళూరులోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్, ఆర్థిక విశ్లేషణ విభాగాధిపతి అయిన ఆమె మంగళవారం 'సమకాలీన భారతదేశంలో వ్యవసాయ సంబంధాలు' అనే అంశంపై అతిథ్య ఉపన్యాసం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్, సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె తమిళనాడులో గమనించిన మార్పులను ప్రస్తావిస్తూ, గ్రామీణ భారతదేశంలోని వ్యవసాయ సంబంధాల సంక్లిష్ట, స్వభావంపై ఉపన్యసించారు. మనదేశంలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ భూస్వాములు, రైతులు, వ్యవసాయ కార్మికులతో సహా వివిధ తరగతులను అర్థం చేసుకోవడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. స్థానిక వైవిధ్యాలను, చారిత్రక, ఆర్థిక పరిస్థితుల ప్రభావాన్ని గుర్తించాలన్నారు. గ్రామీణ రుణం, భూమి యాజమాన్యం, గ్రామీణ భారతంపై పెట్టుబడిదారీ విధానం వంటి సమస్యలను ఆమె వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు సంధించిన ప్రశ్నలకు జవాబులిచ్చారు. ఈ సందర్భంగా సోషియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాకిబ్ ఖాన్ రచించిన (ట్రైబ్ క్లాస్ లింకేజ్) త్రిపురలోని రైతాంగ ఉద్యమ చరిత్ర, రాజకీయాలు అనే పుస్తకాన్ని డాక్టర్ స్వామినాథన్ ఆవిష్కరించారు. ఈ పుస్తకం త్రిపురలోని గిరిజన జనాభాలో వ్యవసాయ వర్గ సంబంధాల అభివృద్ధికి సంబంధించిన చారిత్రక అధ్యాయనాన్ని నివరిస్తుంది. డాక్టర్ ఖాన్ తన పరిశోధనా ప్రయాణం, ఈ పుస్తకాన్ని రచించడంలో ఎదుర్కొన్న సవాళ్లు, అనుభవాలను పేర్కొన్నారు. జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్ జోస్ అతిథిని స్వాగతించి పరిచయం చేశారు. డాక్టర్ రోమా వందన సమర్పణతో ఆతిథ్య ఉపన్యాసం ముగిసింది.

డివైడర్‌ను ఢీకొన్న డీసీఎం

- హార్వెస్టర్ డ్రైవర్ మృతి


మృతిచెందిన హార్వెస్టర్ డ్రైవర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ

నారాయణఖేడ్, మార్చి 26: పంట కోత యంత్రాన్ని (హార్వెస్టర్)ను డీసీఎంలో తీసుకెళ్తుండగా అదుపు తప్పి జాతీయ రహదారికి సంబంధించిన డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యాన్‌లోని హార్వెస్టర్‌పై నిద్రిస్తున్న డ్రైవర్ మృతిచెందాడు. స్థానిక ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన నిజాంపేట నుంచి పంట కోత యంత్రంతో డీసీఎం మంగళవారం తెల్లవారుజామున సంగారెడ్డి-నాందేడ్-అకోలా 161వ జాతీయ రహదారి గుండా బాచేపల్లి వైపు బయలుదేరింది. నిజాంపేట దాటగానే వేగంగా వెళ్తున్న డీసీఎం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎంపై ఉన్న పంటకోత యంత్రంపై నిద్రిస్తున్న దాని డ్రైవర్ కర్ణాటకలోని భల్లారి జిల్లా సిరిగుప్ప తాలుకా దురూర్ గ్రామానికి చెందిన రాజాసాబ్(40) బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

భరోసా లేని వలస కార్మికుల బతుకులు

- అరకొర వసతులతో ఇబ్బందులు
- కనీస సౌకర్యాలు కల్పించని ఇటుక బట్టీల యాజమాన్యాలు


ఉసిరికపల్లిలో టార్పాలిన్ కవర్లతో ఏర్పాటు చేసిన గుడిసెల్లో నివసిస్తున్న వలస కార్మికులు


కొత్తపేట రూప్లాతండాలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్న కార్మికులు

శివ్వంపేట, మార్చి 26: ఇటుక బట్టీల్లో పనిచేయడానికి వచ్చిన వలస కార్మికుల జీవితాలకు భరోసా లేకుండాపోతుంది. బట్టీల యాజమాన్యాలు సరైన వసతులు కల్పించకపోవడంతో టార్పాలిన్ కవర్లతో వేసుకున్న గుడిసెల్లో కాలం వెళ్లదీస్తున్నారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కొత్తపేట రూప్లాతండా, ఉసిరికపల్లితో కలిపి 20కి పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. బట్టీల్లో పనిచేయాడానికి ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 30 కుటుంబాలు బతుకుదెరువు కోసం వచ్చి పనిచేస్తున్నాయి. బట్టీల్లో పనిచేసే చోట కూలీలకు కనీస వసతులు కరువయ్యాయి. కనీసం ఉండేందుకు కూడా సరైన నీడ లేదు. టార్పాలిన్ కవర్లను గుడిసెగా వేసుకుని జీవిస్తున్నారు. ఇదిలా ఉండగా పొద్దంతా పనిచేస్తున్నా.. రోజుకు రూ.400 కూడా రావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే వారికి ఇన్సూరెన్స్ కరువైంది. అలాగే కార్మికుల పిల్లల చదువు కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా ఇటుక బట్టీల యాజమాన్యాలు అవేవీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కార్మికులకు తగిన వేతనంతో పాటు, వారి జీవితాలకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వీధి కుక్కల దాడిలో 28 గొర్రెలు మృతి

- రూ.2.50 లక్షల మేర నష్టం
- మరో ఘటనలో ఇద్దరికి గాయాలు



కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు

శివ్వంపేట, మార్చి 26: వీధికుక్కల దాడిలో 28 గొర్రెలు మృతిచెందగా.. ఇద్దరికి గాయాలయ్యాయి. శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చెందిన బండ యాదయ్య రోజు మాదిరిగానే సోమవారం సాయంత్రం గొర్రెలను మేపుకొచ్చి దొడ్డిలో కొట్టి వెళ్లాడు. కాగా మంగళవారం ఉదయం వెళ్లి చూసేసరికి కుక్కల దాడిలో 28 గొర్రెలు చనిపోయి ఉండగా.. మరో పది తీవ్రగాయాలతో పడి ఉండటంతో బాధితుడు బోరుమన్నాడు. మృతిచెందిన గొర్రెల విలువ సుమారు రూ.2.50 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

మరో ఘటనలో..

కౌడిపల్లి, మార్చి 26: కౌడిపల్లి మండల పరిధి నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన చెల్ల శంకరయ్య సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఆరుబయట నిద్రిస్తుండగా వీధికుక్కలు ఒక్కసారిగా ముఖంపై దాడి చేశాయి. ముక్కు పైభాగంలోని ఎపుకతో పాటు మొహంపై తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆపరేషన్‌కు రూ.2 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని కుటుంబీకులు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన కుమ్మరి అర్జున్(5)పై వీధికుక్కలు మంగళవారం దాడిచేశాయి. వారంరోజుల క్రితం ఇదే పంచాయతీ పరిధిలోని పలువురు గిరిజనులపై కుక్కలు దాడి చేశాయని పేర్కొన్నారు. వీధికుక్కల బారి నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పాశమైలారం పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం


ఎగిసి పడుతున్న మంటలు

పటాన్‌చెరు రూరల్, మార్చి 26: పాశమైలారం పారిశ్రామికవాడలోని ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ పరిశ్రమలో ప్లాస్టిక్ వేస్టేజ్ రీసైక్లింగ్ జరుగుతున్నది. మంగళవారం బయట నుంచి వచ్చిన వేస్టేజ్ డంపింగ్ జరుగుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. సమాచారం అందుకున్న పటాన్‌చెరు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద సమయంలో పరిశ్రమ యజమాని లేకపోవడంతో నష్టం విలువ తెలియరాలేదు.



విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

- 'చేనుకు కంచె, రైతుకు ప్రాణ సంకటం' కథనానికి స్పందన


రాంరెడ్డిపేట్‌లో పంటలకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయొద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశం

కల్హేర్, మార్చి 26: అడవి పందుల బారి నుంచి వివిధ పంటలను కాపాడుకునేందుకు రైతులు విద్యుత్ కంచెలన ఏర్పాటు చేస్తే ఇకనుంచి కఠిన చర్యలు తీసుకుంటామని కల్హేర్ ఎస్ఐ వెంకటేశం హెచ్చరించారు. 'చేనుకు కంచె, రైతుకు ప్రాణ సంకటం' అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు కల్హేర్ ఉమ్మడి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కల్హేర్ ఎస్ఐ వెంకటేశం రైతులతో సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించారు. వారంరోజుల్లో ఇద్దరు యువ రైతులు పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలకు బలయ్యారని, రైతులు ఏ గ్రామంలోనూ పంటల రక్షణ కోసం విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకోవద్దని చెప్పారు. ఎవరైనా అలా చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ గంగారాం, సిబ్బంది ఉన్నారు.

భామనికుంట శిఖం భూమి ఆక్రమణకు యత్నం


జిన్నారం, మార్చి 26: అల్లీనగర్ భామనికుంటలో శిఖం భూమి ఆక్రమణకు చేస్తున్న ప్రయత్నాలను స్థానికులు అడ్డుకున్నారు. అల్లీనగర్ సర్వే నెంబరు 27లో పలు అసైన్డ్ భూములను ఇటీవల పరిశ్రమలకు కేటాయించారు. స్థలాలు పొందిన పలు పరిశ్రమలు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న భామనికుంట శిఖం భూములను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. రైతుల అసైన్డ్ భూములను పరిశ్రమలకు కేటాయించవద్దని మాజీ వార్డుసభ్యుడు వీరేశం గౌడ్, స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు. చెరువు, కుంటల భూముల పరిరక్షణకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

ఎండిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే


ఎల్లారెడ్డిగూడతండాలో పంటలను పరిశీలిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, మార్చి 26: నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడ తండాలో నీరు సరిపడ అందక ఎండిన పంట పొలాలను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే సునీతారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రైతులను మోసపూరిత వాగ్దానాలతో పబ్బం గడుపుకుంటుందన్నారు. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయంతో పాటు భూగర్భ జలాలు అడుగంటి పొలాలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో రుణమాఫీ చేయకుండా మోసం చేసిందన్నారు. నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, శివకుమార్, సత్యంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, హుస్సేన్, లలిత పాల్గొన్నారు.

బిల్డింగ్ పైనుంచి పడి బాలుడి మృతి


హర్మాన్ (ఫైల్)

నంగునూరు, మార్చి 26 : భవనంపై నుంచి పడి బాలుడు మృతి చెందిన సంఘటన నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రైసా బేగం గ్రామంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసం ఉంటున్నారు. రైసా బేగం భర్త ఎండీ సత్తార్ గతంలోనే మృతి చెందాడు. వారి పెద్ద కుమారుడు ఆరో తరగతి చదువుతున్న హర్మాన్ (11) తన స్నేహితులతో కలిసి ఆడుకుంటూ కాలుజారి వారు ఉంటున్న భవనంపై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

ప్రిన్సిపాల్‌పై ఉద్యోగిని ఫిర్యాదు

- లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని పోలీసులకు విన్నపం
- అసత్యమన్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

జోగిపేట, మార్చి 26: ప్రిన్సిపాల్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అందోలులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో బాధితురాలు పనిచేస్తున్నది. రెండేళ్ల కళాశాల ప్రిన్సిపాల్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని, తనకు లొంగకపోతే ఉద్యోగం మానేయాలని బెదిరిస్తున్నాడని పేర్కొన్నది. రెండేళ్లు ఇదేతంతు నడుస్తున్నదని, మారతాడని ఆశించినా ఫలితం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. ఉద్యోగి ఫిర్యాదు మేరకు జోగిపేట ఎస్ఐ అరుణ్‌గౌడ్ మంగళవారం కళాశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. కాగా తనపై ఉద్యోగిని చేసిన ఆరోపణలు అవాస్తమని, పోలీసుల విచారణకు సహకరిస్తానని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

బొల్లారం మున్సిపల్ కార్యాలయం..

కొత్త భవన నిర్మాణానికి మోక్షమెన్నడో?

- రూ.4కోట్లతో నిర్మాణం పూర్తి చేయాలని మూడేళ్ల క్రితమే తీర్మానించిన పాలకవర్గం
- రూ. 3 కోట్ల ఎస్డీఎఫ్ నిధుల నిలిపివేతతో నెలకొన్న సందిగ్ధత
- ప్రత్యామ్నాయ మార్గాలున్నా పట్టించుకోని వైనం
- అరకొర వసతుల మధ్యే సిబ్బంది విధి నిర్వహణ

జిన్నారం, మార్చి 26: ఏటా రూ.10 కోట్ల వరకు ఆదాయం ఉన్న పారిశ్రామిక మున్సిపాలిటీ బొల్లారంలో నూతన పురపాలక కార్యాలయ భవన నిర్మాణానికి తీవ్ర జాప్యం జరుగుతోంది. శిథిలావస్థకు చేరిన పాత మున్సిపల్ భవనం స్థానంలో నూతన కార్యాలయం నిర్మించాలని మూడేళ్ల క్రితమే పాలకవర్గం తీర్మానించింది. కొత్త మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి ఎస్డీఎఫ్ నుంచి 3 కోట్లు, మున్సిపల్ నుంచి రూ.1కోటి నిధుల కేటాయించాలని తీర్మానించగా, ఎస్డీఎఫ్ నిధుల నిలిపివేతతో కొత్త భవన నిర్మాణం ప్రశ్నార్థకమైంది.

ఎస్డీఎఫ్ నిధుల నిలిపివేతతో జాప్యం

బొల్లారం మున్సిపాలిటీ కార్యాలయ నూతన భవనం ఏర్పాటు రెండేళ్లుగా జాప్యం జరుగుతున్నది. పాత భవనం తొలగించేందుకు జేఎన్టీయూ ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలన జరిపి భవనం శిథిలావస్థకు చేరిందనే నివేదికల ఆధారంగా అదేస్థలంలో కొత్త కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదించారు. కాగా కొత్త కార్యాలయం కోసం రూ.4 కోట్ల నిధులు అవసరం కాగా ఆరు నెలల క్రితం నాటి ప్రభుత్వం మున్సిపాటికి మంజూరు చేసిన 30 కోట్ల ఎస్డీఎఫ్ నిధులలో రూ. 3 కోట్లు నూతన మున్సిపల్ భవనం కోసం కేటాయించారు. మరో రూ. 1 కోటి మున్సిపల్ బడ్జెట్‌లో కేటాయించారు. ఈ నిధులతో నాలుగు అంతస్తులతో కొత్త భవనం కట్టాలని తీర్మానం చేశారు. ఇటీవల ప్రభుత్వం మార్పు అనంతరం ఎస్డీఎఫ్ నిధులను నిలిపి వేసింది. మున్సిపల్ భవనం కోసం కేటాయించిన నిధులు అందుబాటులో లేక పనులు ప్రారంభం కాలేదు.


బొల్లారంలో ఈ పాత భవనం స్థానంలోనే కొత్తగా నిర్మించేందుకు ప్రతిపాదించిన స్థలం


ప్రస్తుతం వినియోగిస్తున్న మున్సిపల్ తాత్కాలిక భవనం

అరకొర సదుపాయాల మధ్య విధులు

బొల్లారంలో అనుకూలమైన మున్సిపల్ పాలన భవనం లేక తాత్కాలిక కార్యాలయంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీలో ముఖ్యమైన అధికారులు 10 మంది వరకు ఉండగా, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు 25 మంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మరో 10 మంది ఉండగా పారిశుధ్యం తదితరులు 40 మందితో కలిపి 85 మంది వరకు సిబ్బంది ఉన్నారు. వీరందరికి ప్రస్తుత భవనం ఏ మాత్రం సరిపోవడం లేదు. కాగా మున్సిపాలిటీలో 22 వార్డులు ఉండగా కౌన్సిలర్లు, అధికారులు సిబ్బందితో సమావేశాలు నిర్వహించేందుకు అనువుగా స్థలం కూడా లేదు. దీనికి తోడు నిత్యం వందల సంఖ్యలో వివిధ పనుల కోసం కార్యలయానికి వచ్చే పుర వాసులు నిలబడేందుకూ ఇబ్బందిగానే మారింది. కాగా మున్సిపల్ సిబ్బంది వినియోగించే సామగ్రి, కార్యాలయం ఫర్నిచర్‌కు ఏ మాత్రం అనుకూలంగా లేని పరిస్థితుల మధ్యే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ప్రత్యామ్నాయం ఉన్నా పట్టించుకునేదెవరు..?

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన బొల్లారం మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలు ఏళ్ల తరబడి సాగుతున్నాయి. నూతన మున్సిపల్ భవనం ఏర్పాటుకు ప్రతిపాదించిన ఎస్డీఎఫ్ నిధులు నిలిచిపోగా.. మున్సిపల్ బడ్జెట్ లేదా స్థానిక పరిశ్రమల సీఎస్ఆర్ నిధుల వినియోగంతో కూడా కొత్త భవనం పూర్తి చేసే అవకాశం ఉన్నది. అయినా పాలకవర్గం ఈ విషయంలో జాప్యం చేయటం గమనార్హం. కేవలం రూ.3 కోట్ల నిధులు ఇక్కడ సీఎస్ఆర్ రూపంలో సాధించటం పెద్ద కష్టమేమీ కాదంటున్నారు. మున్సిపల్ ఏర్పాటు జరిగి నాలుగు ఏళ్లు గడిచింది.. మరో ఏడాదిలో గ్రేటర్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ప్రభుత్వం ఓ వైపు ప్రయత్నాలు చేపట్టింది. వెంటనే కొత్త భవనం పనులు చేపట్టక పోతే ఇక అటకెక్కినట్లే అనే ప్రచారం కూడా జరుగుతోంది.

> **నిర్లక్ష్యంతోనే భవన నిర్మాణంలో జాప్యం**
>
> మున్సిపల్ భవన నిర్మాణంలో నాటి ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే పనులు ప్రారంభం కాలేదు. ఎస్డీఎఫ్ నిధులు మంజూరు ప్రకటన చేసినప్పటికీ ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. అధికారులు సకాలంలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించలేదు. మున్సిపల్ సహా ఇతర నిధుల వినియోగంతోనూ కొత్త భవనం నిర్మించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం లేదు.
>
> - అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్

మద్యం సేవించిన వ్యక్తి పడుకున్న చోటే మృతి

జిన్నారం, మార్చి 26: మద్యం సేవించి పడుకున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కాజీపల్లి వద్ద చోటు చేసుకుంది. బొల్లారం సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం ఆగుకృష్ణపాటి శ్రీనివాస్‌రెడ్డి(42) మంగళవారం ఉదయం 9.30గంటల ప్రాంతంలో కాజీపల్లి శివారు గోల్డెన్ ఇండియా క్రషర్ వద్ద మద్యం తాగి పడుకొని అక్కడే మృతి చెందాడు. మృతుడు ఏపీలోని నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట మండలంలోని తిమ్మనాయుడుపల్లి గ్రామానికి చెందినవాడు కాగా, హైదరాబాద్ వనస్థలిపురం బీఎన్‌రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం కూలీ పని కోసం కాజీపల్లికి వచ్చి ఓ మేస్త్రీ కింద పని చేస్తున్నాడు. మృతుడికి నిత్యం మద్యం సేవించే అలవాటుతో పాటు అనారోగ్యం తోడైంది. దీంతో మద్యం సేవించి పడుకున్న స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి సోదరుడు వెంకటేశ్వర్లురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

క్షయ నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలి


క్షయవ్యాధి నివారణ దినోత్సవంలో డీఎంహెచ్‌వో గాయత్రీదేవి, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, మార్చి 26: జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి తెలిపారు. సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా టీబీ పరీక్షలు పెంచి కేసులను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డా.రాజేశ్వరి మాట్లాడుతూ క్షయ రోగులతో కలిసి ఉంటే కుటుంబ సభ్యులందరూ కూడా క్షయ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం క్షయ నివారణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వైద్య సిబ్బందిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో క్షయ నివారణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


పాదయాత్రగా వెళ్తున్న వారికి దుప్పట్లను అందజేస్తున్న బర్దీపూర్ ఆశ్రమపీఠాధిపతి అవధూతగిరి మహరాజ్

జహీరాబాద్, మార్చి 26: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహరాజ్ పేర్కొన్నారు. ఈ నెల 20న నారాయణఖేడ్ నియోజకవర్గంలోని బెల్లాపూర్ ఆశ్రమం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మంగళవారం జహీరాబాద్ నుంచి ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ ఆశ్రమానికి చేరుకున్నది. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ.. సమాజంలో డబ్బు ఎంత సంపాదించినా ప్రయోజనం లేదని, సేవాభావంతో పుణ్య కార్యక్రమాలను చేపడితేనే సార్థకత చేకూరుతుందన్నారు. పుణ్యాకార్యాలవల్లే దైవకృప మనందరిపై ఉంటుందన్నారు. అనంతరం పాదయాత్రగా వెళ్తున్న వారికిదుప్పట్లను, మంచినీటి ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బర్దీపూర్ ఆశ్రమ భావిపీఠాధిపతి సిద్దేశ్వరమహరాజ్, న్యాంతాబాద్ ఆశ్రమపీఠాధిపతి శివాచార్యులు, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, వెంకటేశం, నాయకులు రాజు కాంట్రాక్టర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమపై రైతులకు అవగాహన


వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి, సిబ్బంది, రైతులు

కొండాపూర్, మార్చి 26: పాడిపరిశ్రమల వ్యవసాయ విధానాలపై సంగారెడ్డి డివిజన్ రైతులకు వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కొండాపూర్ రైతు వేదికలో రైతులతో కలిసి జిల్లా వ్యవసాయ అధికారి నర్సింగరావు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన శాస్త్రవేత్త గోవర్ధన్ రైతులకు సమగ్ర వ్యవసాయంలో గొర్రెల పెంపకం, కోళ్ల పెంపకం, చేపల పెంపకం, డ్రోన్‌లతో నేరుగా విత్తడం, పురుగు మందుల పిచికారీ, డ్రోన్ పైలట్‌కి శిక్షణా ఎక్కడ పొందాలనే విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏడీఏ మనోహర్, వ్యవసాయ సంచాలకులు ప్రతిభ, క్లస్టర్ ఏఈ వేలు రవి, డివిజన్ ఏఈవోలు, ఆత్మ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్ పై పోలీసుల దాడి.. వ్యక్తిపై కేసు


మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

చిలప్‌చెడ్, మార్చి 26: ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు చేస్తున్న బెల్ట్‌షాప్‌పై పోలీసులు దాడి చేసి ఒకరిపై కేసు నమోదు చేసిన సంఘటన మంగళవారం మండలంలోని చిట్కుల్ గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానిక ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్కుల్ గ్రామానికి చెందిన పోతరపల్లి అంజయ్య అనే వ్యక్తి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో తన దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయాలు చేపట్టాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి దుకాణంలో నుంచి రూ. 2,970 విలువైన మద్యాన్ని పట్టుకున్నారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

వెల్దుర్తి, మార్చి 26: మెదక్ జిల్లాలో పది పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ తెలిపారు. మంగళవారం వెల్దుర్తి పది పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 68 పది పరీక్ష కేంద్రాలలో 10,300 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు హాజరైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలుగకుండా, పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నామని, పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీస్ స్టేషన్ లేని గ్రామాల్లో 16సెంటర్లలో సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్టు తెలిపారు. డీఈవో వెంట ఎంఈవో యాదగిరి ఉన్నారు.

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి అర్బన్, మార్చి 26 : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం భౌతిక, రసాయన శాస్త్రం పరీక్ష జరిగింది. జిల్లాలోని 121 కేంద్రాల్లో పరీక్ష కేంద్రాల్లో 22,060 మంది విద్యార్థులు 22,022 మంది హాజరుకాగా, 38 మంది గైర్హాజరయ్యారు. 99.83 హాజరు శాతం నమోదైంది. సంగారెడ్డి మండలంలోని రెండు పరీక్షా కేంద్రాలను డీఈవో వెంకటేశ్వర్లు తనిఖీ చేయగా, 17 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పరిశీలించారు.

ప్రాణదాతలు కావడం గొప్ప ఆలోచన: డీఎస్పీ


రక్తదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ

సంగారెడ్డి రూపల్, మార్చి 26: దుఃఖంలోనూ ఇతరులకు ప్రాణదాతలు కావాలనే ఆలోచన చాలా గొప్పదని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ కుమారుడు జి. ప్రశాంత్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం కార్యక్రమాన్ని డీఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. జయరాజ్ కుటుంబంలో జరిగిన రోడ్డు ప్రమాదం వారి కుమారుడిని దూరం చేయడం బాధాకరమన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, అతి వేగంతో వాహనాలను నడపకూడదని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. అనిల్‌కుమార్, పట్టణ సీఐ భాస్కర్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ప్రజా సంఘాల నాయకులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక వివాహానికి ఏర్పాట్లు.. బాలసదన్‌కు తరలింపు

రామాయంపేట, మార్చి 26: మైనర్ బాలిక(14) పెళ్లికి సిద్ధమైన విషయం తెలుసుకున్న అధికారులు ఆమెను మెదక్ బాలసదన్‌కు తరలించారు. మండలంలోని ఓ తండాకు చెందిన గిరిజన కుటుంబం మరో పక్షం రోజుల్లో కూతురు వివాహం చేసేందుకు అబ్బాయి కుటుంబంతో ఒప్పందం కుదిరింది. మంగళవారం ఈ సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ స్త్రీశిశు సంక్షేమ శాఖ సంయుక్త నిర్వహణలో బాలిక తల్లిదండ్రుల వద్దకు చేరుకుని కౌన్సెలింగ్ చేశారు. అనంతరం సదరు బాలికను బాలసదన్‌లో ఉంచారు.

ఫోన్ ట్యాపింగ్ కారకులపై చర్యలు తీసుకోవాలి

నర్సాపూర్, మార్చి 26: నిబంధనలకు విరుద్ధంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డవారితో పాటు అందుకు కారకులైనవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు డి.అంజనేయులుగౌడ్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసు అధికారులు రాజకీయ అవసరాల కోసం నిబంధనలకు విరుద్ధంగా ఫోన్ ట్యాపింగ్ చేయడం దారుణమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయాలని చెప్పిన సదరు నాయకుల పేర్లు కూడా బయట పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పైతరలో వైభవంగా రథోత్సవం

కొల్చారం, మార్చి 26: కొల్చారం మండల పరిధిలోని పైతరలో శ్రీ భ్రమరాంబిక మల్లిఖార్జునస్వామివారికి మంగళవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను రథంపై అధిష్ఠింపజేసి గ్రామంలోని వీధుల గుండా ఊరేగింపు జరిపారు. గ్రామస్థుల జయజయ ధ్వానాల మధ్య గ్రామంలోని వీధుల గుండా రథాన్ని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం ఆలయంలో భ్రమరాంబిక మల్లిఖార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పుట్టి చంద్రయ్య, బోయిని లచ్చయ్య, కోరంపల్లి సత్తయ్య, మిద్దె కిష్టయ్య, తాటి మల్లేశం, షాదుల్లా, మాడబోయిన మల్లేశం, మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీభ్రమరాంబికమల్లిఖార్జునస్వామి రథోత్సవంలో భక్తులు

నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేటర్‌గా రమేష్‌గౌడ్


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న రమేష్‌గౌడ్

నర్సాపూర్,మార్చి 26: జహీరాబాద్ పార్లమెంటు ఎన్నికల బీజేపీ కోఆర్డినేటర్‌గా నర్సాపూర్‌కు చెందిన ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. చిన్నరమేష్‌గౌడ్‌ను నియమించారు. త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఆయా నియోజకవర్గాల పరిధిలో పార్టీ ప్రచార కార్యక్రమాలకు సమన్వయకర్తలుగా కో ఆర్డినేటర్లను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నియమించారు. అందులో భాగంగా నర్సాపూర్‌కు చెందిన పి.చిన్నరమేష్‌గౌడ్‌ను నియమించారు. దీంతో మంగళవారం ఆయన హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను అందరి సహకారంతో విజయవంతంగా పూర్తి చేయడానికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట జిల్లా ఓబీసీ అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ ఉన్నారు.

మరోసారి బీజేపీ పాలన ఖాయం: రఘునందన్‌రావు

రామచంద్రాపురం, మార్చి 26: దేశంలో మరోసారి బీజేపీ పాలన ఖాయమని రాష్ట్ర మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం రామచంద్రాపురంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి అధ్యక్షతన భూత్‌లెవల్, ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారం తీరుపై బీజేపీ శ్రేణులకు వివరించారు.

పురాతన ఆలయాల నిర్మాణం గొప్పది


మాధవానందస్వామితో ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి, మార్చి 26: పురాతన ఆలయాల నిర్మాణం తీరు ఎంతో గొప్పదని రంగంపేట పీఠాధిపతి మాధవానంద స్వామి పేర్కొన్నారు. మంగళవారం కౌడిపల్లిలోని హనుమాన్, ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాల మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆయన హాజరయ్యారు. ప్రతీ మనిషి ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం హనుమాన్ ఆలయంలో 1,600 తమలపాకులతో అభిషేకం చేసి హోమం నిర్వహించారు. కార్యక్రమానికి నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హాజరై స్వామి ఆశీర్వాదాలు పొందారు.

'జహీరాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయం'

పుల్‌కల్, మార్చి 26: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ టికెట్‌ను ఉద్యమకారుడు గాలి అనిల్‌కుమార్‌కు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని ఆ పార్టీ సీనియర్ నేత, జోగిపేట వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని శివ్వంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉద్యమకారుడికి ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించినందుకు మాజీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తప్పుడు వాగ్దానాలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల వ్యవధిలోనే కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారని అన్నారు. 420 హామీలతో వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపొందడం ఖాయమని పల్లె సంజీవయ్య ధీమా వ్యక్తం చేశారు.

ఖేడ్‌లో ముమ్మరంగా వాహనాల తనిఖీ


ఖేడ్‌లో డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నారాయణ ఖేడ్, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట లోని దుర్గాభవానీమాత ఆలయం వద్ద నిజాంపేట-ఖేడ్-బీదర్ 161బీ జాతీయ రహదారిపై స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. సంగారెడ్డి, జోగిపేట, హైదరాబాద్‌లతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో అన్ని వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో డీఎస్పీతో పాటు స్థానిక సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి


శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

జహీరాబాద్, మార్చి 26: 2023-24 సంవత్సరానికి సంబంధించి జహీరాబాద్ పట్టణ ప్రజలు మున్సిపాలిటీకి పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రూ.10కోట్లపై చిలుకు వివిధ రకాల పన్నులు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.5కోట్లపై చిలుకు వసూలు చేశామన్నారు. పట్టణ ప్రజలు తమ సిబ్బందికి సహకరించి పన్నులు చెల్లించాలని ఆయన కోరారు. పన్నుల చెల్లింపులో రాయితీసౌకర్యం కల్పించామని వివరించారు. మరిన్ని వివరాలకు జహీరాబాద్ మున్సిపల్‌కార్యాలయంలో అధికారులను సంప్రదించాలన్నారు.

అంబలి దివ్యామృతంతో సమానం


హవేళీఘణపూర్‌లో అంబలి వితరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నవీన్‌గుప్తా

హవేళీఘణపూర్, మార్చి 26: అంబలి దివ్యామృతంతో సమానమని మాజీ సర్పంచ్ శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలో అంబలి వితరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అంబలి శరీరానికి చల్లదనాన్ని ఇస్తుందన్నారు. ఇందులో ఉన్న పోషకాలతో వ్యాధి నిరోధకత పెంపొందుతుందని వివరించారు. రాజరాజేశ్వర పారాబాయిల్డ్ రైస్‌మిల్ యజమాని జగదీశంగుప్తా ఉచిత అంబలి వితరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సత్యసాయిసేవా సమితి సభ్యులు సాయిబాబ, నవీన్‌గుప్తా, రాజశేఖర్, వెంకటేశం, శేఖర్ రెడ్డి తదితరులున్నారు.

చేగుంట పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం

చేగుంట, మార్చి 26: అన్ని మతాలవారు కలిసిమెలిసి పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చేగుంట ఎస్ఐ బాల్‌రాజు సూచించారు. మంగళవారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాల్‌రాజు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మండల రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు జింక శ్రీనివాస్, మైనార్టీ మండల అధ్యక్షుడు షకీల్, నాయకులు జలీల్, శ్రీనివాస్, సోమ సత్యనారాయణ, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కొల్చారంలో జోరుగా అభివృద్ధి పనులు

- వివిధ గ్రామాల్లో మురుగుకాల్వలు, సీసీరోడ్లకు రూ.1.10 కోట్లు


ఏటిగడ్డమాందాపూర్‌లో వేసిన సీసీ రోడ్డు

కొల్చారం, మార్చి 26: మండలంలో ఆయా గ్రామాల్లో మురికి కాల్వలు, సీసీ రోడ్ల పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని 21 గ్రామ పంచాయతీలుండగా మొత్తం 25 పనులకు గాను రూ.1.10కోట్ల నిధులు మంజూరయ్యాయి. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు కావడంతో మార్చి నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులను అప్రమత్తం చేశారు. కాగా మంజూరైన పనుల వివరాల్లోకి వెళ్తే.. వరిగుంతం గ్రామ పంచాయతీలోని కుడిచెర్వు తండాలో సీసీ రోడ్డుకు రూ.4లక్షలు, కొంగోడులో హనుమాన్ కాలనీలో సీసీ రోడ్డుకు రూ.4లక్షలు, మురికి కాల్వలు మరియు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 5లక్షలు, నాయిన్ జలాల్‌పూర్‌లో సీసీ రోడ్డుకు రూ.3లక్షలు, నాయిన్ జలాల్‌పూర్‌లో మురికి కాల్వల నిర్మాణానికి రూ. 5లక్షలు, పోతిరెడ్డిపల్లిలో సీసీ రోడ్డుకు రూ.4లక్షలు, మురికికాల్వల నిర్మాణానికి రూ.5లక్షలు, వెంకటాపూర్‌లో సీసీ రోడ్డుకు రూ.3లక్షలు, ఏటిగడ్డ మాందాపూర్‌లో సీసీ రోడ్డుకు రూ.3లక్షలు, మురికి కాల్వల నిర్మాణం మరియు సీసీ రోడ్డుకు రూ.5లక్షలు, అంసాన్‌పల్లిలో సీసీ రోడ్డుకు రూ.3లక్షలు, మురికి కాల్వలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, రాంపూర్‌లో సీసీ రోడ్డుకు రూ.3లక్షలు, కోనాపూర్‌లో సీసీ రోడ్డుకు రూ.3లక్షలు, మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్డుకు రూ.5లక్షలు, అప్పాజిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, పైతరలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, పోతంశెట్‌పల్లిలో మురికికాల్వల నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 5లక్షలు, కిష్టాపూర్‌లో మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, ఎనగండ్లలో మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్డుకు రూ.5లక్షలు, సంగాయిపేటలో మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్డుకు రూ.5లక్షలు, చిన్నాఘన్‌పూర్‌లో మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, వరిగుంతంలో మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్డుకు రూ.5లక్షలు, రంగంపేటలో మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్డుకు రూ.5లక్షలు, కొల్చారంలో మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్డుకు రూ.5లక్షలు మంజూరయ్యాయి.